'ఉపాధి' గొంతుపై ఉక్కుపాదం

- నరేగాకు కేంద్రం తూట్లు.. పేదోళ్లకు పాట్లు
- రాష్ట్రంలో జాబుకార్డుల తొలగింపు ఐదు లక్షలకుపైనే
- 100 రోజుల పనికాదు.. 44.5 రోజులే
- ఈ ఏడాది 17.3 లక్షల మంది పనులకు దూరం
- ఒక్క జాబ్‌కార్డుపై ఏడాది సగటు ఆదాయం రూ.7,308నే
- 2020-21లో ఆ ఆదాయం రూ.8,606
- ఈ ఏడాది రూ.678.62 కోట్లు నష్టపోయిన కూలీలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉపాధి కూలీల గొంతుపై బిజెపి సర్కారు ఉక్కుపాదం మోపుతున్నది. ఉపాధి హామీ చట్టానికి ఏటేటా నిధుల తగ్గింపు, ఆధార్‌తో అనుసంధానం, వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడం, సౌకర్యాల కల్పనలో తీవ్ర జాప్యం వంటి చర్యలకు పాల్పడుతూ కూలీలకు పొమ్మనకుండానే పొగపెడుతున్నది. వారు పట్టణాలకు వలసలు పోయేలా చేసి లేబర్ ఆర్మీని సృష్టిస్తున్నది. తక్కువ వేతనాలతో కూలీలు పనులు చేసేలా చేసి కార్పొరేట్లకు లాభాలు గడించి పెడుతున్నది. తాజాగా తెలంగాణలో ఉపాధి హామీ చట్టం అమలు తీరుపై లిబ్‌టెక్ సంస్థ వెల్లడించిన నివేదిక కూడా ఇదే సత్యాన్ని ఘోషిస్తున్నది. ఈ ఏడాది ఐదు లక్షలకుపైగా జాబ్‌కార్డుల తొలగించబడ్డాయి. కూలీలు రూ.678.62 కోట్ల రూపాయలను కోల్పోయారు. దీనిని బట్టే చట్టం ఎలా నిర్వీర్యం అవుతుందో అర్థం చేసుకోవచ్చు.

వామపక్షాల ఒత్తిడితో యూపీఎ-1 ప్రభుత్వం అనివార్యంగా గ్రామీణ పేద ప్రజలకు ఆర్థిక, సామాజిక స్వావలంబన కలిగించేలా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చింది. గ్రామీణ వ్యవస్థలోని ఆర్థిక వ్యత్యాసాల్లో కొంతలో కొంతైనా తగ్గించడానికి ఇది ఎంతో దోహదపడింది. వ్యవసాయ పనులు లేని కాలంలో పేదోళ్లకు కొండంత అండగా నిలిచింది. ఇది జగమెరిగిన సత్యం. కానీ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పోతున్నది. తెలంగాణపై మరీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. మన రాష్ట్రంలో 52.8 లక్షల జాబ్‌కార్డులున్నాయి. ఈ ఏడాది ఐదు లక్షలకుపైగా జాబ్ కార్డులు(8.2 శాతం)తొలగింపబడ్డాయి. ఉపాధి హామీ చట్టం మొదలైనప్పటి నుంచి కార్డులను ఇంత పెద్ద సంఖ్యలో తొలగించడం ఇదే తొలిసారి. 2018-19లో 16వేల కార్డుల తొలగింపే ఇప్పటిదాకా అత్యధికం. ఈ ఏడాది తొలగించిన కార్మికుల సంఖ్య కూడా ఎక్కువే. 17.3 లక్షల మంది కార్మికులను పనులకు దూరం చేసింది. అదే సమయంలో పని కావాలంటూ కొత్తగా చేరింది 1.8 లక్షల మంది కార్మికులే. యావరేజీగా 14.8 శాతం కూలీలు పనులకు దూరం అయ్యారు. జాతీయ సగటు 13.2 శాతం మాత్రమే. ఈ తొలగింపు జాతీయ సమస్యగా ముందుకొచ్చింది. సంగారెడ్డి జిల్లాలో అత్యధిక కూలీలు, జోగులాంబ గద్వాల జిల్లాలో అత్యల్పంగా పనులకు దూరం అయ్యారు.

ఏప్రిల్ 2022 మార్చి 2023 వరకు చూస్తే అన్ని నెలల్లో ఒకలా పనులు దొరకలేదు. రాష్ట్రంలో వ్యవసాయ సీజన్‌లో కాకుండా మిగతా రోజుల్లోనే పనులకు వెళ్లటం వల్ల ఈ వ్యత్యాసం కనిపిస్తున్నది. 2022 మే లో అత్యధికంగా కూలీలకు 432.03 లక్షల పనిదినాలు కల్పించారు. జనవరిలో అతితక్కువగా 12.63 లక్షల పనిదినాలే దక్కాయి. వంద రోజుల పని ఎక్కువ పూర్తి చేసిన జిల్లా సంగారెడ్డి. తక్కువ కుటుంబాలకు వంద రోజుల పని దొరికింది కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో. రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా కూలీలకు 44.54 రోజుల పనిదినాలు మాత్రమే దొరికాయి. 2022-23లో 100 రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలు జాతీయస్థాయిలో 16.7 శాతంగా ఉంటే..రాష్ట్ర స్థాయిలో 19.1 శాతం ఉంది. ఇది ఒక రకంగా రికార్డు. అయితే, 2020-21తో పోలిస్తే 2022-23లో జాబ్‌కార్డులకు పనిదినాల కల్పన భారీగా తగ్గింది. 2020-21లో మహిళలు 19.18 కోట్ల పనిదినాలు(మొత్తం పనిదినాల్లో 58.1 శాతం) పూర్తి చేస్తే...ఈ ఏడాది 2022-23కి చూసుకుంటే 59.2 శాతానికి పెరిగింది. పురుషుల సంఖ్య తగ్గింది. నరేగాలో మహిళల క్రియాశీల పాత్ర పెరుగుతున్నది. కారణమేమిటని విశ్లేషిస్తే అరకొరగా పనులు లభించడం, నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో పెట్టడం వంటి అంశాలతో పురుషులు క్రమంగా 'ఉపాధి'కి దూరమై వేరే పనులు వెతుక్కుంటున్నారు.

ఈ ఏడాది రూ.678.62 కోట్లు నష్టం

2020-21లో ఉపాధి హామీ చట్టం ద్వారా ఒక జాబ్‌కార్డుపై కుటుంబానికి సగటున రూ.8,606 లభించింది. 2022-23కి వచ్చే సరికి ఆ ఆదాయం రూ.7,308కి పడిపోయింది. అంటే రెండేండ్లలో సగటు ఆదాయం 1298 రూపాయలు తగ్గింది. 2021-22లో 31.11 లక్షల జాబ్ కార్డుల ద్వారా కూలీలు పని చేయగా..2022-23కి ఆ సంఖ్య 27.35 లక్షలకు పడిపోయింది. 2020-21లో ఒక కుటుంబం సగటున 50.77 రోజుల పనిని పొందింతే..ఈ ఏడాది అది 44.54 రోజులకు తగ్గింది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు రూ. 237 వేతనం నిర్ణయించగా...సగటున రూ.169.51 కూలి దక్కింది. 2022-23కి వచ్చేసరికి కేంద్ర ప్రభుత్వం రూ.257గా నిర్ణయించింది. కూలీలకు సగటున దక్కిందేమో రూ.164.33 మాత్రమే. రోజువారీ వేతనాన్ని రూ.20 పెంచినట్టు కేంద్రం గొప్పలకు పోతున్నప్పటికీ వాస్తవంగా కూలీలకు దక్కుతున్నది మాత్రం ఏటేటా పడిపోతున్నది. రెండేండ్ల కిందటితో పోల్చి చూసినా సగటు వేతనం ఐదు రూపాయలు తగ్గటం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి ఏటేటా నిధులు తగ్గిస్తూ పోవటం వల్ల కూలీల కోసం ఇచ్చే వేతనాలూ తగ్గుతున్నాయి.

2020-21లో కూలీలు మొత్తం రూ.2,677.46 కోట్లు పొందగా ఆ మొత్తం ఈ ఏడాది వచ్చేసరికి రూ.1998.84 కోట్లకు తగ్గింది. అంటే ఈ ఏడాది తెలంగాణ కూలీలు నష్టపోయింది అక్షరాలా..678.62 కోట్ల రూపాయలు.

నష్టపోయిన ఎస్సి, ఎస్టి తరగతులు

పనిదినాల కల్పన విషయంలో 2020-21, 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలను చూసుకుంటే సగటున 16.6 శాతం పనిదినాలు తగ్గాయి. పనిదినాలు కోల్పోయిన వారిలో ఎక్కువగా షెడ్యూల్డ్ తెగలే ఉన్నాయి. రాష్ట్రంలో ఎస్టిలకు 2020-21లో 320.64 లక్షల వ్యక్తిగత పనిదినాలు లభించగా..ఆ సంఖ్య ఈ ఏడాదికి 245.02 లక్షలకు తగ్గింది. అంటే 18.7 శాతం పనిదినాలు తగ్గాయి. ఎస్సిలు 2020-21లో 356.97 లక్షల వ్యక్తిగత పనిదినాలు పొందగా..2022-23కి వచ్చేసరికి ఆ సంఖ్య 265.69 లక్షల వ్యక్తిగత పనిదినాలకు పడిపోయింది. సగటున 17.5 పనిదినాలు తగ్గాయి. నరేగా కింద ఎస్సి,ఎస్టిలకుఉపాధి అవకాశాలు క్షీణిస్తున్నాయని చెప్పడానికి ఇదే ప్రత్యక్ష ఉదాహరణ. వారి జీవనోపాధిపైనా ఈ ప్రభావం పడుతున్నది.

ఆధార్ అనుసంధానంతో ఆగమాగం

జనవరిలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థను తీసుకొచ్చింది. ఇందులో నమోదుకు మార్చి 31కి డెడ్‌లైన్ పెట్టింది. దీనివల్ల 9.2 శాతం కూలీలు ఉపాధి హామీ పనులకు అనర్హులయ్యారు. ఇప్పటిదాకా 59.5 లక్షల మంది యాక్టివ్ వర్కర్లుఉండగా 54 లక్షల మందే ఆధార్ లింకు చేసుకున్నారు. 1.05 కోట్ల రిజిస్టర్ వర్కర్ల ఆధారంగా చూస్తే 42.8 లక్షల మంది (40.8 శాతం) అర్హత కోల్పోతున్నారు. జిల్లాల వారీగా అనర్హత పొందిన వారిలో ములుగు, రంగారెడ్డి జిల్లాలు ముందువరుసలో ఉన్నాయి. జాబ్‌కార్డులు, వర్కర్ల తొలగింపు, ఆధార్ అనుసంధానం వంటి అంశాలు ఉపాధి కూలీలపై చాలా ప్రభావం చూపాయి. వేతనాలు సకాలంలో అందక కొందరు పనులకు వెళ్లటం మానేశారు. ఈ సమస్యపై వెంటనే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

అత్యున్నత స్థాయిలో తెలంగాణ పంచాయతీలు

- రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక జాతీయ అవార్డులు
- సిఎం కెసిఆర్ హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పచ్చదనం, పరిశుభ్రతతోపాటు పలు అభివృద్ధి ఇతివృత్తాలు (థీం) విభాగాల్లో తెలంగాణ పంచాయతీలు దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలవడం, ఆ సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక జాతీయ అవార్డులను అందుకోవడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మొత్తం 46 ఉత్తమ అవార్డుల్లో 13 అవార్డులను తెలంగాణ రాష్ట్రమే కైవసం చేసుకోవడం మనందరికీ గర్వకారణమని సిఎం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "దేశ వ్యాప్తంగా 2.5 లక్షల గ్రామ పంచాయతీలు ఈ అవార్డుల కోసం పోటీపడగా అందులో కేవలం 46 గ్రామాలు మాత్రమే అవార్డులు దక్కించుకున్నాయి. ఇందులోంచి 13 అవార్డులు తెలంగాణకే వచ్చాయి. ప్రకటించిన మొత్తం జాతీయ అవార్డుల్లో 30 శాతం తెలంగాణ రాష్ట్రమే కైవసం చేసుకుంది. ఈ 13 ర్యాంకుల్లోంచి కూడా నాలుగు మొదటి ర్యాంకులు తెలంగాణకే రావడం గొప్పవిషయం." అని సిఎం కెసిఆర్ హర్షం వ్యక్తం చేశారు.

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును, కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హనుమంతరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిపిలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, పంచాయితీరాజ్ శాఖ అధికారులకు కెసిఆర్ ఈ సందర్భంగా అభినందించారు. పల్లె ప్రగతి సహా అనేక కార్యక్రమాల ద్వారా దేశానికే ఆదర్శంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న గ్రామీణాభివృద్ధి కార్యాచరణకు ఈ అవార్డులు సాక్ష్యంగా నిలిచాయని సిఎం అభిప్రాయపడ్డారు. పంచాయతీల అభివృద్ధిలో రాష్ట్రం ప్రతి అంశంలోనూ అగ్రగామిగా నిలిచి, అత్యధిక అవార్డులు గెలుచుకున్న స్పూర్తితో మున్ముందు కూడా తమ కృషి కొనసాగుతుందని కెసిఆర్ ప్రకటించారు.

జనాకర్ష దర్శకుడు రేలంగి నరసింహారావు

ప్రజాశక్తి-కల్చరల్

హాస్య సందేశాత్మక మిలిత సినిమాలకు దర్శకత్వం వహించిన రేలంగి నరసింహారావు జనాకర్షక దర్శకుడని వక్తలు ప్రశంసించారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై శారద మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో తెలుగు హిందీ చిత్ర గీతాల విభావరి సోమవారం జరిగింది. శారద, రేణుక, పద్మ, అచ్యుత, భార్గవి, రమాదేవిలు డాక్టర్ వాసుదేవ రెడ్డి, సుబ్బి రెడ్డి, మూర్తి, సంపత్, శోభన్ బాబు, వేణుగోపాలాచారి తదితరులతో కలిసి అలనాటి బాలీవుడ్, టాలీవుడ్ చిత్రాల్లోని పాటలను మధురంగా పాడారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో రేలంగి నరసింహారావు పాల్గొని మాట్లాడారు. నాటి సినీ పాటలు నేటికి నిలిచి ఉండటానికి కారణం సాహిత్య సంగీత విలువలేనని అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు త్రినాధరావు వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజులతో కలిసి సంస్థ స్థాపకురాలు శారద దర్శకుడు రేలంగి నరసింహారావును సత్కరించారు.

నాటకాల ప్రభావం సమాజంపై ఉంటుంది

- మంత్రి శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి-కల్చరల్

సత్య హరిచంద్ర వంటి నాటకాల ప్రభావం సమాజంపై ఉంటుందని, నేడు సినిమాల వల్ల కొంత రంగస్థల కళా ప్రక్రియలు వెనుకపడ్డాయని రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖా మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై గుమ్మడి గోపాలకృష్ణ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా మూడు రోజులు పద్య నాటక ప్రదర్శన సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని లాంఛనంగా ఉత్సవాలు ఆరంభించి మాట్లాడారు. పొరుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటకలతో సమంగా కొత్త రాష్ట్రమైనప్పటికీ కళలకు ప్రాధాన్యత ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇస్తున్నామని తెలిపారు. గుమ్మడి గోపాలకృష్ణ వంటి నటులు పద్య నాటకాలలో యువ కళాకారులను తయారు చేయాలన్నారు. అధ్యక్షత వహించిన ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణ మాట్లాడుతూ.. నాడు షణ్ముఖి ఆంజనేయరాజు, పీసపాటి నరసింహమూర్తి వంటి ప్రసిద్ధులు పద్య నాటకాలను వైభవంగా నిలిపారని, నేడు గుమ్మడి గోపాలకృష్ణ ఆ స్థాయిలో పేరుపొందారని ప్రశంసించారు. వంశీ రామ తదితరులు సభలో పాల్గొన్నారు. సత్య సాయి కళానికేతన్ వారిచే బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన సత్యహరిచంద్ర నాటకం గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించారు. సత్యపాలన కోసం చక్రవర్తి అయిన హరిచంద్రుడు ఎలా కష్టాలుకువోర్చు కొన్న కథాంశంతో సాగిన ఈ నాటకంలో హరిచంద్రుడుగా గుమ్మడి గోపాలకృష్ణ పద్య అలాపనతో ఆకట్టుకున్నారు. చంద్రమతిగా రత్నశ్రీ అదే స్థాయిలో నటించారు. బాబు రాజు, మురళీ మలా ్లది, భాస్కర్ తదితరులు ఇతర పాత్రలలో పాల్గొని నాటకాన్ని రక్తి కట్టించారు.

సంక్షేమ పథకాలను వివరించేలా ప్రచార రథాలు

- ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో సాధ్యమయ్యే పథకాలు మహారాష్ట్రలో ఎందుకు సాధ్యం కావని బిఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 450 స్కీములపై మహారాష్ట్రలోని పలు గ్రామాల్లో ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఔరంగాబాద్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపిలు కేవలం ఓట్లు, సీట్ల రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణకు కెసిఆర్ పాలన స్వర్ణయుగమని అభివర్ణించారు. రైతుబంధు, ఉచిత విద్యుత్, రుణమాఫీ, ధాన్యం సేకరణ, రైతుబీమా, రైతు వేదికల నిర్మాణం, మిషన్ కాకతీయ, వ్యవసాయ యాంత్రీకరణ, రాయితీపై విత్తనాల సరఫరా, సబ్సిడీకి సూక్ష్మ సేద్యం పరికరాల పంపిణీ, గురుకుల పాఠశాలలు, కళాశాలల నిర్వహణ, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, కెసిఆర్ కిట్, మిషన్ భగీరథ, హాస్టల్ విద్యార్థులకు సన్న బియ్యం, కిశోర బాలికలకు హెల్త్ కిట్లు, వందకుపైగా డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు తదితర వాటితో కెసిఆర్ పాలనలో మార్పు వచ్చిందని జీవన్ రెడ్డి తెలిపారు.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు కోర్టు, రాజమహేంద్రవరం

M.V.O.P. 305/2021

Between:
Smt. Thatavarthi Ratna Mala ***...Petitioner***
AND
Jurrigala Sukkayya and Others ***...Respondents***

R-1: Juggirala Sukayya, S/o. Venkatayya, Hindu, aged 41 years, Resident of 12-241, Ram Nagar Colony, Nagarkurnool, Mahaboob Nagar, Telangana - 509209. ***...1st Respondent***

పై నంబరు పిటిషనులో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 10-5-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ అక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

మద్దూరి సాయిభాస్కర్ శంకర్
రాజమండ్రి అడ్వకేటు, దానవాయిపేట
01-3-23 రాజమండ్రి

హెచ్‌ఎండిఎ డైరెక్టర్‌కు సిఐటియు ధన్యవాదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హెచ్‌ఎమ్‌డిఎ కార్మికులకు వేతనాలు పెంచడంతో హెచ్‌ఎమ్‌డిఎ డైరెక్టర్‌కు సిఐటియు నాయకత్వం ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండిఎ ప్రధాన కార్యాలయానికి హెచ్‌ఎమ్‌డిఎ పార్క్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) అధ్యక్షులు భూపాల్, ఉపాధ్యక్షులు జగదీష్, యూనియన్ ప్రధాన కార్యదర్శి భిక్షపతి, నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జగన్ వెళ్లారు. డైరెక్టర్‌ను సన్మానించారు. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్, పార్కులు, నర్సరీలో సుమారు 500 మంది కార్మికులు కొన్నేండ్లుగా పనిచేస్తున్నారు. వారికి కనీస వేతనాలు పెంచాలని సిఐటియు ఆధ్వర్యంలో ఏడాదిగా పోరాటం చేశారు. ఇటీవల జాయింట్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో అగ్రిమెంట్ జరిగింది. కనీస వేతనం అమలు చేయడంతోపాటు పిఎఫ్ ఇఎస్ఐ బకాయిలు చెల్లించడానికి, విడిఎ కరువు భత్యం కూడా అమలు చేయడానికి హెచ్‌ఎండిఎ అధికారులు అంగీకరించి ఉత్తర్వులు ఇచ్చారు.

ఐకెపి విఒఎల సమ్మె

- వేతనం పెంచాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమస్యలు పరిష్కరించాలని.. వేతనాలు పెంచాలని, తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఐకెపి విఒఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో విఒఎలు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి దిగారు. క్షేత్రస్థాయిలో రోజంతా కష్టపడి పనిచేస్తున్న తమకు రూ.3900 వేతనం ఇవ్వటం దారుణమని, దీంతో కుటుంబం ఎలా గడుస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 20 ఏండ్ల నుంచి గొడ్డు చాకిరీ చేస్తున్న తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయం ఎదుట సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్, విఒఎల సంఘం జిల్లా కార్యదర్శి సిరిశెట్టి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సమ్మె ప్రారంభించారు. కౌటాల, పెంచికల్‌పేట్ మండల కేంద్రాల్లోనూ విఒఎలు సమ్మెలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట.. విఒఎలు ధర్నా చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నటరాజన్‌కు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి డిఆర్‌డిఒ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఎపిడి చరణ్‌దాస్‌కు వినతిపత్రం అందజేశారు.

ఐకెపి విఒఎలు నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపల్ కేంద్రంలో సమ్మె చేపట్టారు. ఈ సమ్మెను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారాబోయిన శ్రీనివాస్ ప్రారంభించారు. డిండి మండలంలో నిర్వహించిన విఒఎల సమ్మెలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కేతావత్ శరత్ కుమార్ పాల్గొన్నారు. మర్రిగూడలో సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. నాంపల్లిలో తహసీల్దార్ కార్యాలయం ముందు సమ్మెలో కూర్చున్నారు. నిర్వహించారు. దామరచర్ల, చండూరులో సమ్మె నిర్వహించారు.

ఐకెపి, విఒఎల సమస్యలను పరిష్కరించాలని వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వనపర్తి మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట ఐకెపి విఒఎ ఉద్యోగులు సమ్మె ప్రారంభించారు. జడ్చర్ల మండల కేంద్రంలో సమ్మె చేశారు.

24 నుంచి అమరుల సంస్మరణ వారోత్సవాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 24 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు ప్రజా ఉద్యమ క్షేత్రంలో నేలకొరిగిన అమరుల సంస్మరణ వారోత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలని ఎంసిపిఐ(యు) కేంద్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పంజాబ్‌లోని చండీఘర్‌లో ఈ నెల 13 నుంచి ప్రారంభమైన ఎంసిపిఐ(యు) జాతీయ కమిటీ సమావేశాలు శనివారంతో ముగిశాయని తెలిపారు. మేడేను ఫాసిజానికి వ్యతిరేకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. మే 9న వీర తెలంగాణ రైతన్న సాయుధ పోరాట యోధులు, మాజీ ఎంపి భీంరెడ్డి నరసింహరెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించామని వివరించారు. మార్క్సిజం, లెనినిజం పునాదిగా భారతదేశంలో ఉన్న ఫ్యూడల్ భూస్వామ్య పెత్తందారీ మనువాద సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలని తెలిపారు

తిరుపతి, షిరిడీకి టూరిజం బస్సులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో పర్యాటకుల సౌలభ్యం కోసం హైదరాబాద్-తిరుపతి-తిరుమల, హైదరాబాద్-షిరిడిల మధ్య నూతనంగా కొనుగోలు చేసిన ఏసి స్లీపర్ కోచ్ బస్సులను టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కార్యాలయం ప్రాంగణం నుంచి ఈ బస్సులు బయలుదేరాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం ఎండీ మనోహర్, ఇండియా టూరిజం రీజినల్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, ఓఎస్‌డీ సత్యనారాయణ, రాజలింగం, మల్లికార్జునరాజు, శాంతి, జ్యోతి, ఇబ్రహీం, నాథన్, బాలకృష్ణ, రవి నాయక్, నరసింహారావు, సమ్మయ్య, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంచల్‌గూడ జైలులో ప్రవీణ్, రాజశేఖర్‌లను విచారించిన ఇడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీక్ కేసుకు సంబంధించి ప్రధాన నిందితులైన ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు చంచల్‌గూడ జైలులో విచారించారు. ఈ ఇద్దరిని రెండ్రోజుల పాటు చంచల్‌గూడ జైలులో విచారించడానికి నాంపల్లి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. దీంతో నలుగురు అధికారులతో కూడిన దర్యాప్తు బృందం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో చంచల్‌గూడ జైలుకు చేరుకొని విచారణను ప్రారంభించింది. ఈ సందర్భంగా కోర్టు ఆదేశాల మేరకు ఈ ఇద్దరు నిందితులను విచారించడానికి చంచల్‌గూడ జైలులోనే ప్రత్యేక గదిని జైలు అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 నుంచి సాయంత్రం 5.40 గంటల వరకు దాదాపు ఆరు గంటల పాటు ఈడీ అధికారులు విచారించారు. టిఎస్‌పిఎస్‌సి చైర్మెన్ పీఏ అయిన ప్రవీణ్ కుమార్‌ను, ఇదే విభాగంలో కంప్యూటర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేసిన రాజశేఖర్‌రెడ్డిలను మొదట వేర్వేరుగా, తర్వాత కొద్ది సేపు ఇద్దరిని కలిపి ఈడీ అధికారులు విచారించినట్టు తెలిసింది.

ముఖ్యంగా, టిఎస్‌పిఎస్‌సి పరీక్షా పత్రాన్ని కంప్యూటర్ నుంచి తస్కరించడానికి ఈ ఇద్దరు అనుసరించిన మార్గాల పైనే ఈడీ అధికారులు ప్రధానంగా దృష్టి సారించి ప్రశ్నించినట్టు తెలిసింది. ముఖ్యంగా, ఉన్నతాధికారులు అత్యంత రహస్యంగా కంప్యూటర్లలో నిక్షిప్తం చేసిన ఈ ప్రశ్నాపత్రాలను మూడో కంటికి తెలియకుండా సెక్యూరిటీ పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేస్తారనీ, అటువంటి సెక్యూరిటీ పాస్‌వర్డ్‌లు మీ చేతికి ఎలా వచ్చిందని ఇద్దరు నిందితులను ఈడీ అధికారులు నిలదీసినట్టు సమాచారం. ఇందుకు తెర వెనక ఎవరైనా ఉన్నతాధికారి సహకరించారా? లేక యుక్తిగా మీరే పాస్‌వర్డ్‌ను సాధించారా? అనే కోణంలో ప్రవీణ్, రాజశేఖర్‌లను ఈడీ అధికారులు గుచ్చిగుచ్చి ప్రశ్నలు సంధించినట్టు తెలిసింది. చేతికి చిక్కిన ప్రశ్నాపత్రాన్ని ఎంత మందికి లీక్ చేశారు? తద్వారా ఒక్కొక్కరి నుంచి తీసుకున్న సొమ్మెంత?, మూకుమ్మడిగా విక్రయించారా? లేదా వేర్వేరుగా విక్రయించారా? ఇందులో విదేశీ అభ్యర్థులకు ఎంత మందికి విక్రయించారు? తదితర కోణంలో అధికారులు ప్రశ్నలను సంధించారని సమాచారం. అలాగే, విదేశీ అభ్యర్థుల నుంచి ఏ మార్గాన వీరి చేతికి భారీ మొత్తంలో డబ్బులు చేరాయి? అని కూడా ఈడీ అధికారులు ఆరా తీసినట్టు తెలిసింది. ఇదే క్రమంలో మంగళవారం కూడా ఈ ఇద్దరు నిందితులను విచారించనున్నట్టు సమాచారం.

మార్కెట్లకు ఐటి షేర్ల దెబ్బ

- 9 రోజుల లాభాలకు తెర
- సెన్సెక్స్ 520 పాయింట్ల పతనం

ముంబయి : వరుసగా తొమ్మిది రోజుల పాటు లాభాల పరంపరను సాగించిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలు చవి చూశాయి. ఐటి షేర్లు కుప్పకూలడంతో సూచీలపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఉదయం నుంచే నష్టాల్లో సాగిన బిఎస్‌ఇ సెన్సెక్స్ తుదకు 520 పాయింట్లు పతనమై 59,911కు పడిపోయింది. ఇంతక్రితం తొమ్మిది సెషన్లలో ఈ సూచీ 2,816 పాయింట్లు రాణించింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 121 పాయింట్లు కోల్పోయి 17.707 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో ఇన్ఫోసిస్ ఏకంగా 9.4 శాతం పతనమయ్యింది. ఓ దశలో ఆ కంపెనీ షేరు బిఎస్ఇలో 12.21 శాతం నష్టపోయి రూ.1,219 వద్ద ముగిసి.. 52 వారాల కనిష్టాన్ని తాకింది. ఒక్క పూటలోనే కంపెనీ మార్కెట్ విలువ దాదాపు రూ.73,000 కోట్లు కోల్పోయింది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఇన్ఫోసిస్ ఫలితాలు అంచనాలను చేరకపోవడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నలాజీస్, విప్రో, టిసిఎస్ సూచీలు 2-5 శాతం వరకు నష్టపోయాయి. ఎల్‌అండ్‌టి, ఎన్‌టిపిసి, హెచ్‌డిఎఫ్‌సి సూచీలు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఉదయం ప్రతికూలతలో ప్రారంభమైన సూచీలకు ఏ దశలోనూ కొనుగోళ్ల మద్దతు లభించలేదు. వరుస లాభాల నేపథ్యంలోనూ మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. నిఫ్టీలో ఐటి రంగం సూచీ 4.71 శాతం నష్టపోయింది. ఫైనాన్సియల్ సర్వీసెస్, ఫార్మా, హెల్త్‌కేర్ సూచీలు స్వల్పంగా విలువ కోల్పోయాయి. మార్కెట్లు భారీ నష్టాలు చవి చూడకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులు 3.13 శాతం, రియాల్టీ 1 శాతం, ఎఫ్ఎంసిజి 1.03 శాతం చొప్పున పెరిగి కొంత మద్దతును అందించాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 0.5 శాతం, స్మాల్ క్యాప్ 0.2 శాతం చొప్పున పెరిగాయి.

నీట్ విద్యార్థుల కోసం అలెన్ సూపర్ యాప్

హైదరాబాద్ : నీట్-పిజి, ఐఎన్ఐ-సెట్, ఎఫ్ఎంజిఇ విద్యార్థుల కోసం సూపర్ యాప్‌ను ఆవిష్కరించినట్లు మెడికల్ కోచింగ్ సంస్థ అలెన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ యాప్ విస్తృత శ్రేణిలో వినూత్న ఫీచర్లను, వనరులను అందిస్తుందని పేర్కొంది. పిజి మెడికల్ విద్యార్థులు తమ విద్యా, నైపుణ్య లక్ష్యాలను సులభంగా సాధించేలా ఇది తోడ్పాటునందిస్తుందని పేర్కొంది.

నేడు భారత్‌లో తొలి ఆపిల్ స్టోర్ ప్రారంభం

ముంబయి : దిగ్గజ టెక్ ఉత్పత్తుల కంపెనీ ఆపిల్ భారత మార్కెట్‌పై ప్రధాన దృష్టి పెట్టింది. దేశంలో తన తొలి సొంత స్టోర్‌ను ముంబయిలో ఏర్పాటు చేస్తుంది. మంగళవారం దీన్ని ఆపిల్ సిఇఒ టిమ్ కుక్ లాంచనంగా ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 20న ఢిల్లీలో తన రెండో స్టోర్ తెరవనుంది. ఆపిల్ ఎప్పటి నుంచో భారత్‌లో తమ ఉత్పత్తులను విక్రయిస్తోంది. రిటైల్ స్టోర్‌లో కస్టమర్లు ఆపిల్ ఉత్పత్తులను సందర్శించడానికి కొనుగోలు చేయడానికి వీలుంటుంది. ఈ రిటైల్ స్టోర్‌లో పనిచేసే 100 కంటే ఎక్కువ మంది సిబ్బంది ఉండటంతో పాటుగా.. వారు ఏకంగా 20కి పైగా భాషల్లో వినియోగదారులకు సేవలందించనున్నారు. దేశవ్యాప్తంగా వేలాది ఉద్యోగాల సృష్టికి కట్టుబడి ఉన్నామని ఆ సంస్థ పేర్కొంది.

సంక్షేమమే సగం బలం

- కాళేశ్వరం నీళ్లతోనే కల్పతరువు
- సిద్దిపేట జిల్లాకు అర్బన్ మండలం హైటెక్ సిటీ
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల సంక్షేమమే పాలకులకు సగం బలమని ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో సోమవారం జరిగిన బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కెసిఆర్ కృషితో వచ్చిన కాళేశ్వరం నీళ్ల పుణ్యమా అని నేడు నియోజకవర్గస్థాయిలో కష్టాలు పోయి కల్పతరువు వచ్చిందన్నారు. నియోజకవర్గస్థాయిలో నాడు రూ.30 కోట్ల పంట పండితే.. నేడు రూ.300 కోట్ల పంట పండుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో రూ.1,500 కోట్ల పంట కొనుగోలు చేయనున్నామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు విలువ, గౌరవం పెరిగిందని తెలిపారు. సిద్దిపేట అభివృద్ధి తెరిచిన పుస్తకమని అన్నారు. నాడు ట్యాంకర్లతో నీళ్లు పోసుకుని బతుకమ్మలు వేసే వాళ్లమని, కనీసం చేపలు బతకడానికి కూడా నీళ్లు ఉండేవి కావని, నేడు ఎండా కాలంలోనూ చెరువులు మత్తడి దూకుతూ నిండుకుండలా కనిపిస్తున్నాయన్నారు. సిద్దిపేట సర్కార్ దవాఖానలో అన్ని రకాల పరికరాలతో కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. జిల్లాకు అర్బన్ మండలం హైటెక్ సిటీగా మారిందన్నారు. జిల్లా నలుమూలల నుంచి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నామన్నారు. నంది ఎల్లయ్య ఐదు సార్లు గెలిచి రైలు తీసుకురాలేదని, కెసిఆర్ కృషితో సిద్దిపేటకు రైలు వచ్చిందని తెలిపారు. బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు డప్పు చప్పులతో కోలాటాలతో తరలివచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ చీఫ్ వెంకటేశ్వరరావు, జడ్‌పి చైర్మన్ రోజాశర్మ, సుడా చైర్మెన్ రవీందర్ రెడ్డి, ఎంపిపి సవితా ప్రవీణ్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కమలాకర్‌రావు, కార్యదర్శి రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుపాకుల బాల్ రంగం, ప్రవీణ్‌రెడ్డి, టీఆర్ఎస్ అర్బన్ మండల శాఖ అధ్యక్షులు ఎద్దు యాదగిరి, స్థానిక ప్రజాప్రతినిధులు, మిట్టపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు జేపీ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి

- ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్
- మండుటెండలో భారీ ప్రదర్శన, కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టిన పేదలు, నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలందరికీ ఇంటి స్థలానికి పట్టాలు, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వందలాది మంది పేదలు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణంలోని కేఎస్ఎం బంక్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు దరఖాస్తులు, వినతిపత్రాలు అందజేశారు. ఈ ర్యాలీ, ధర్నాకు జిల్లా వ్యాప్తంగా నిరుపేదలు వందల సంఖ్యలో మండుటెండలో చంటి పిల్లలతో సహా తరలివచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 58, 59 ప్రకారం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా పేదలు ఎండకు ఎండి, వానలకు తడిసి, చలిలో కూడా.. విష పురుగుల మధ్య జీవనం సాగిస్తున్నారని, మంచినీరు, కరెంట్ లేకపోయినా ఇంటి స్థలం కోసం అనేక బాధలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో వివిధ రకాల కూలి పనుల కోసం అనేక మండలాల నుంచి వచ్చిన పేదలు ఇంటి కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చుంచుపల్లి మండలంలో సర్వే నెంబర్ 137/1.. 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో 500 గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని, ఇల్లందు మండలం బాలాజీ నగర్‌లో సర్వే నెంబర్ 506లో 30 గుడిసెలు, సీఎస్పీ బస్తీలో సర్వే నెంబర్ 627లో 200 గుడిసెలు, సుజాత నగర్ మండలంలో పాత అంజనాపురం గ్రామంలో 200 గుడిసెలు, రాఘవాపురం గ్రామంలో 40 గుడిసెలు, కాసాని లక్ష్మినగర్‌లో 40 గుడిసెలు, పాల్వంచ మండలంలో సర్వే నెంబర్ 444 పాలకోయతండా ప్రియదర్శిని కాలనీల్లో 130 కుటుంబాలు నివసిస్తున్నారని తెలిపారు. వీరందరికీ వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు శెట్టి వినోద, జిల్లా ఉపాధ్యక్షులు ఆలేటి కిరణ్, జిల్లా నాయకులు దొడ్డ రవికుమార్, భూక్య రమేష్, సందకూరి లక్ష్మి, గండమాల భాస్కర్, సోలం నాగరత్నం, కోటా బాలకృష్ణ, జబ్బ సంధ్యారాణి, భారతమ్మ, ప్రేమ్ కుమార్, సిద్దెల రాములు, లలిత తదితరులు పాల్గొన్నారు.

హీమోఫిలియో వ్యాధిపై అవగాహన

ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హీమోఫిలియో వ్యాధిపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ హీమోఫిలియో దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ కాప్రాలో ఎన్‌పిఆర్‌డి అధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హీమోఫిలియోతో బాధపడే వారికి కోవిడ్-19 అనేక సమస్యలు తెచ్చిపెట్టిందన్నారు. హీమోఫిలియోతో బాధపడే వారికి చిన్న గాయం అయినా రక్తం గడ్డకట్టకపోవడంతో రక్తస్రావం ఎక్కువగా జరిగి మరణించే ప్రమాదం ఉందన్నారు. హీమోఫిలియో-ఏ ప్రతి 10,000 మందిలో ఒక్కరికి, హీమోఫిలియో-బీ ప్రతి 20,000 మందిలో ఒక్కరికి వస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయని తెలిపారు. హీమోఫిలియో-ఏ కంటే హీమోఫిలియో-బీ నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. స్త్రీల కంటే పురుషులలో ఇది ఎక్కువగా ఉంటుందన్నారు.

దేశంలో హీమోఫిలియో ఉన్న వారికి ఆరోగ్య సంరక్షణ అందించడంతో కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. హీమోఫిలియో రోగ నిర్ధారణ, చికిత్సకు మన దేశంలో అవసరమైన పరికరాలు అందుబాటులో లేవన్నారు. కావునా ఈ వ్యాధి చికిత్స కోసం అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితుల్లో రోగనిరోధక శక్తిని పెంచేందుకు ముందస్తు చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణతోపాటు మిగతా రాష్ట్రాల్లో ఉచితంగానే చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, మోతి బాయి, చందు లాల్, మంగియా పాల్గొన్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లో ఒపిఎస్ అమలు

- ఏప్రిల్ 1 నుంచే వర్తింపు
- సిఎం సుఖ్‌విందర్ సింగ్ సుఖుకు ఎన్‌ఎంఒపిఎస్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హిమాచల్‌ప్రదేశ్‌లో ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్) పునరుద్ధరించబడింది. ఒపిఎస్‌ను అమలు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈనెల ఒకటో తేదీ నుంచి దాన్ని వర్తింపచేస్తున్నట్టు ఆ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఓట్ ఫర్ ఒపిఎస్ కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాత పెన్షన్ అందుకుంటున్నారని, ఈ సందర్భంగా వారికి నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్‌ఎంఓపీఎస్) సెక్రెటరీ జనరల్ స్థిత ప్రజ్ఞ శుభాకాంక్షలు తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖుకు కృతజ్ఞతలు ప్రకటించారు. అనంతరం స్థితప్రజ్ఞ, తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ ఒక ప్రకటన విడుదల చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో 2003, మే 15 నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) అమలవుతున్నదని వివరించారు. దానికింద నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకి 1972 సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ అమలు చేయుటకు 1,36,000 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరిస్తూ హిమాచల్ ప్రదేశ్‌లో మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని తెలిపారు. మే ఒకటి 2023 నుంచి అక్కడ పూర్తిస్థాయిలో విధివిధానాలతో కూడిన ఒపిఎస్‌కి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిందని పేర్కొన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఎన్‌పీఎస్ కోసం 10 శాతం నిలిపివేయబడుతుందని వివరించారు. ఒపిఎస్ అమలు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ జీపీఎఫ్ ఖాతాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇప్పటివరకు రిటైర్ అయిన వారికి కూడా ఓపిఎస్ ప్రయోజనాలు పునరుద్ధరించబడతాయని క్యాబినెట్ ప్రకటించిందని పేర్కొన్నారు. మిగతా రాష్ట్రాలు కూడా ఓపిఎస్ అమలు చేసి సిపిఎస్ ముక్త్ భారత్ కావాలని కోరారు.

డాక్యుమెంట్ రైటర్ దారుణ హత్య

- యాక్సిడెంట్‌గా చిత్రీకరించేందుకు ప్రయత్నం
- ప్రధాన నిందితుడు ఎంపిపి పిన్నింటి మధుసూదన్ రెడ్డి
- ఐదుగురుపై కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్యుమెంట్ రైటర్‌ను కిడ్నాప్ చేసి, దారుణంగా చావబాది హత్య చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎంపిపి పిన్నింటి మధుసూదన్‌రెడ్డితో పాటు పలువురు పరారీలో ఉన్నారు. నిందితుల కోసం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డిసిపి నారాయణరెడ్డి, ఎసిపి కుషాల్కర్, సిఐ బాలరాజు సోమవారం మీడియాకు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన మామిడి కరుణాకర్ రెడ్డి (29) కొత్తూరు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కొంతకాలంగా కొత్తూరు ఎంపిపి సభ్యులు పిన్నింటి మధుసూదన్ రెడ్డికి, ఇతని మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. గతంలో మృతుడు కరుణాకర్ రెడ్డి, ఎంపిపి ప్రధాన అనుచరుడిగా ఉండేవాడు. ఆ సమయంలో ఎంపీపీ చేసిన భూ అక్రమాలు, ఆర్థిక లావాదేవీలు మృతునికి పూర్తిస్థాయిలో తెలియడంతో అవి ఎక్కడ బయటపడతాయోననే నేపంతోనే హత్య చేసినట్టు తెలుస్తోంది. ఆదివారం సాయంత్రం చికెన్ తీసుకురావడానికి తన మామ శ్రీధర్ రెడ్డితో కలిసి కారులో కరుణాకర్‌రెడ్డి బయలుదేరారు. శ్రీధర్ రెడ్డి తన బంధువును మామిడిపల్లిలో దించి తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా తీగాపూర్ సమీపంలోని బ్రిడ్జ్ వద్ద నిందితులు పిన్నింటి విక్రం రెడ్డి, పిన్నింటి విష్ణువర్ధన్ రెడ్డి, అరిఫ్, చిట్టేడి అరుణ్ కుమార్ రెడ్డి స్కార్పియో వాహనంతో వీరిని అడ్డుకున్నారు. నిందితులు.. శ్రీధర్‌రెడ్డిని కొట్టి ఎవరికైనా చెప్తే 'నిన్ను చంపేస్తాం' అంటూ బెదిరించి అతని ఫోన్‌ను బద్దలు కొట్టారు. అనంతరం కరుణాకర్ రెడ్డిని బలవంతంగా ఈడ్చుకొని తమ వాహనంలో ఎక్కించుకొని చేగురు వైపు వెళ్లిపోయారు. ఈ క్రమంలో అతన్ని తీవ్రంగా కొట్టి చంపినట్టు తెలుస్తోంది. అనంతరం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లి.. శంషాబాద్ వద్ద ప్రమాదం జరిగిందంటూ ఎమర్జెన్సీ వార్డులో కరుణాకర్‌రెడ్డిని అడ్మిట్ చేసి, పరారయ్యారు. కాగా, రాత్రి 10 గంటల సమయంలో కాంటినెంటల్ హాస్పిటల్ నుంచి పోలీసులకు ఫోన్ రాగా.. వారు శవాన్ని చూసి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహం కరుణాకర్ రెడ్డిదేనని అతని బంధువులు ధ్రువీకరించారు. హాస్పటల్ సీసీపుటేజ్ ఆధారంగా కిడ్నాప్ చేసిన వ్యక్తులే సిసి పుటేజ్‌లో ఉన్నట్టు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, తమ కుమారుని మృతి వార్త తెలుసుకున్న కన్నతల్లి పోలీస్ స్టేషన్ ఎదుట రోధిస్తూ కూర్చుంది. కనిపించిన ప్రతి ఒక్కరిని కాళ్లు పట్టుకొని తనకు న్యాయం చేయాలని, తన కొడుకును చంపిన వారిని జైలుకు పంపి తగిన శిక్ష పడేలా చేయాలని రోధిస్తుండటంతో అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడిపెట్టించింది. ఆమెతో పాటు మల్లాపూర్ గ్రామస్తులూ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని నిందితులను అరెస్టు చేసేంత వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. కొత్తూరు పాత జాతీయ రహదారిపై మృతుని తల్లితో కలిసి కాంగ్రెస్, బిజెపి నాయకులు ధర్నా చేపట్టారు. భారీగా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

అరకొర వేతనం.. సమస్యలతో సతమతం..!

- 20 ఏండ్లుగా సేవలందిస్తున్నా పెరగని జీతం
- సమ్మెబాట పట్టిన ఐకెపి విఒఎలు
- సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి, స్వయం సహాయక సంఘాల అభ్యున్నతికి దోహదం చేస్తున్న ఐకెపి విఒఎల పరిస్థితి దయనీయంగా మారింది. ఆయా సంఘాలకు రుణాలు ఇప్పించడం, తిరిగి వాటిని రికవరీ చేయడం, పింఛన్లు అందించడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్దిదారులకు చేర్చడంలో వీరిదే కీలకపాత్ర. ఆయా సంఘాల ఆర్థిక లావాదేవీలతోపాటు ప్రభుత్వ పథకాల లబ్దిదారుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. వీరికి ఈ పని తప్పితే మరో పని చేయడం వీలుకాలేని పరిస్థితి. ఎప్పటికైనా సెర్ప్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తిస్తుందనే నమ్మకంతో పనిచేస్తున్నారు. నెలకు ప్రభుత్వం నుంచి వచ్చే రూ.3900తోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటడంతో వచ్చే జీతంతో కనీసం సరుకులు కూడా పూర్తి స్థాయిలో కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.

గ్రామాల్లో పని చేస్తున్న గ్రామ స్వయం సహాయక సేవకులకు ప్రభుత్వం అందించే అరకొర వేతనంతో జీవనం సాగిస్తూ ఆర్థిక భారాన్ని మోస్తున్నారు. వచ్చే వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారడంతో మనోవేదనకు గురవుతున్నారు. 20 ఏండ్లుగా గ్రామాల్లో సేవలందిస్తున్నా ప్రభుత్వం తమను గుర్తించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు కేవలం రూ.3900 చెల్లించడంతో ఈ వేతనం ఎటూ సరిపోవడంలేదని చెబుతున్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నుంచి సమ్మె బాటపట్టారు. ప్రభుత్వం స్పందించే వరకు కొనసాగిస్తామని ఆ సంఘం నాయకులు స్పష్టం చేస్తున్నారు.

విధులు బహిష్కరించి సమ్మెబాట

దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఐకెపి విఒఎలు సోమవారం నుంచి సమ్మెబాట పట్టారు. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 500 మంది విఒఎలు పనిచేయగా ఉమ్మడి జిల్లాలో 2 వేలకుపైగా విధులు నిర్వర్తిస్తున్నారు. విధులు బహిష్కరించి మండలాల్లో నిరసన చేపట్టారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి రూ.10 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా కల్పించాలని, గుర్తింపు కార్డులు అందజేయాలని చెబుతున్నారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా విఒఎ ఖాతాల్లో చెల్లించాలని, జాబ్‌చార్ట్‌తో సంబంధం లేని ఆన్‌లైన్, ఇతర పనులను చేయించకూడదని స్పష్టం చేస్తున్నారు.అర్హులైన వీఓఏలకు పదోన్నతులు కల్పించాలని తెలిపారు.

కుటుంబ పోషణ భారంగా మారుతోంది

కె.రాజేష్, ఐకెపి విఒఎల సంఘం జిల్లా అధ్యక్షులు

తమకు ప్రభుత్వం కేవలం రూ.3900 వేతనంగా అందజేస్తోంది. ఈ జీతంలో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఇందులో పని ఒత్తిడి కారణంగా ఇతర పనులు కూడా చేయలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి రూ.26వేల వేతనం అందించాలి. సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తాం.

ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

అన్నమొల్ల కిరణ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

అనేక ఏండ్లుగా అరకొర వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న ఐకెపి విఒఎ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు రూ.26 వేల వేతనం అందించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఇతర నేతలు

జనగామలో రజక వృత్తిదారుల మహాసభ

- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి ఎర్రబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభ జనగామలో జరుపుకోవడం అభినందనీయమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తిని నెమరు వేసుకోవడం మంచి విషయమన్నారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మూడో మహాసభ వాల్ పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్ హబ్సిగూడలోని ఓ ప్రయివేటు కార్యక్రమంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వృత్తిదారుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి కెసిఆర్.. ఆధునీకరణ ఉపాధి కల్పన కోసం రాష్ట్రవ్యాప్తంగా రజక వృత్తిదారులకు ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేసినట్టు తెలిపారు. వృత్తిదారులకు సబ్సిడీలు అందజేసి బతుకు భరోసా కల్పించారని చెప్పారు. ఉద్యమాల ఖిల్లా జనగామ జిల్లాలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మూడో మహాసభ ఈనెల 29, 30 తేదీల్లో జరుపుకోవడం అభినందనీయమన్నారు. మహాసభ విజయవంతం కోసం తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం నిర్వహిస్తూ అనేక విజయాలు సాధించిన రజక వృత్తిదారుల సంఘానికి ప్రజలు అండగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, అధ్యక్షులు నరేష్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి ఉపేందర్, నాయకులు మదర్, ఐలయ్య, రంగన్న, రమేష్ పాల్గొన్నారు.

వేడుకగా సివి రామన్ యంగ్ జీనియస్ అవార్డుల బహూకరణ

హైదరాబాద్: సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరుసగా 30వ సంవత్సరం విద్యార్థులకు సర్ సివి రామన్ యంగ్ జీనియస్ అవార్డుల బహూకరణ వేడుకగా జరిగింది. ఆదివారం సాయంత్రం నగరంలోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర స్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల విజేతలకు అవార్డులు, పతకాలు అందించారు. పలు విద్యాసంస్థల ప్రిన్సిపళ్లు, చైర్మన్లకు గురుబ్రహ్మ అవార్డులను బహుకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ హాజరవ్వగా, అతిథిగా ప్రముఖ సినీనటుడు అడివి శేష్, సుచిర్ ఇండియా ఫౌండేషన్ చైర్మన్ కిరణ్ పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షలలో విజేతలను ఎంపిక చేసి అన్ని జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఈ బహుమతులు అందించారు. ఈ పోటీలలో 500 పాఠశాలలకు చెందిన 50 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వారి నుంచి 20 మందికి స్వర్ణ పతకాలు, 20 మందికి జాతీయ ర్యాంకులు, 20 మందికి రాష్ట్రస్థాయి ర్యాంకులు, 450 మందికి జిల్లా స్థాయి ర్యాంకులు అందించారు. దాంతోపాటు ఆరు చైతన్య పురస్కారాలు, 5 గురుబ్రహ్మ అవార్డులను అందించారు. కార్యక్రమంలో సుచిర్ ఇండియా ఫౌండేషన్ తృష్ణ జర్నల్‌నుఎన్‌విరమణ ఆవిష్కరించారు.

మత సామరస్యాన్ని కాపాడింది టిడిపినే

- ఎన్‌టిఆర్ భవన్ ఇఫ్తార్ విందులో చంద్రబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో మతసామరస్యాన్ని కాపాడింది టిడిపినే అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అన్నారు. తెలుగుదేశం తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ఎన్‌టిఆర్ భవన్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఆహ్వానం మేరకు చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిడిపి పాలనకు ముందు, తరువాత హైదరాబాద్‌ను చూడాలని అభిప్రాయపడ్డారు. తెలుగుదేశం హయాంలో 14 జిల్లాల్లో ఉర్దూను రెండో భాషగా అమలు చేసినట్టు గుర్తు చేశారు. అంతకుమునుపు హజ్ యాత్రకు ముస్లింలు వెళ్లాలంటే ముంబయి వెళ్లాల్సి వచ్చేదనీ, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లోని అసెంబ్లీకి ఎదురుగా హజ్‌హౌజ్‌ను నిర్మించి ఇక్కడి నుంచే వెళ్లటానికి నేరుగా విమానాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీని ఏర్పాటు చేశామనీ, ముస్లింలకు రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, దుకాన్ మకాన్లు పెట్టడం, షాదీఖానాలు ఏర్పాటు చేయడం, మసీదులకు ఆర్థిక సాయం వంటివి చేసినట్టు చెప్పారు. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో మంచి పనులు చేసినవారికి అల్లా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖరరెడ్డి, బక్కని నర్సింహులు, రాష్ట్ర పార్టీ సమన్వయ కర్త కంభంపాటి రామ్మోహన్ రావు, జాతీయ కమిటీ క్రమశిక్షణ సంఘం సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, జాతీయ అధికార ప్రతినిధి టి.జ్యోత్స్న, ఉపాధ్యక్షులు అలీ మస్కతీ, వాసిరెడ్డి రామనాథం, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు కనగల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఫిట్‌మెంట్ సమీక్షించాలి

- 7 శాతం పెంపుతో 90 శాతం ఉద్యోగులకు నష్టం
- భవిష్యత్ పోరాటాలకు సిద్ధంకండి
- టిఎస్‌యుఇఇయు రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ ఉద్యోగులకు యాజమాన్యం ప్రకటించిన ఏడు శాతం ఫిట్‌మెంట్ నిర్ణయాన్ని పున్ణసమీక్షించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ నిర్ణయం వల్ల 90 శాతం మంది ఉద్యోగులకు నష్టం జరుగుతుందని స్పష్టంచేసింది. సోమవారంనాడిక్కడ జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే ఈశ్వరరావు, వీ గోవర్ధన్, సిఐటియు కార్యదర్శులు భూపాల్, జె.వెంకటేష్, టిఎస్ఎస్‌పిడిసిఎల్ అధ్యక్షులు ఎస్ చంద్రారెడ్డి, టిఎస్ఎన్‌పిడిసిఎల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, కే సత్యం, ఎమ్ ప్రసాద్, రాష్ట్ర నాయకులు జే బస్వరాజ్, జే ప్రసాద్‌రాజుతో పాటు ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. యాజమాన్య నిర్ణయం వల్ల సర్వీసు తక్కువగా ఉన్న ఆర్టిజన్లు, జెఎల్‌ఎమ్, ఎఎల్‌ఎమ్ ఎల్‌డిసి, యుడిసిలకు నష్టం జరుగుతుందని రాష్ట్ర కమిటీ తెలిపింది. ఉద్యోగులకు పెద్ద ఎత్తున నష్టం కలిగిస్తూ, అన్యాయానికి గురిచేస్తున్న యాజమాన్య నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.

కొత్తపేటలో 'మ్యూజిగల్' అకాడమీ ప్రారంభం

హైదరాబాద్ : మ్యూజిక్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ మ్యూజిగల్ తమ నాలుగవ అత్యాధునిక సంగీత అకాడమీని హైదరాబాద్‌లోని కొత్తపేటలో ప్రారంభించింది. 1700 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన దీన్ని ఫౌండర్ లక్ష్మీ నారాయణ ఏలూరి సమక్షంలో గాయకులు పార్థసారథి, శ్రీకృష్ణ విష్ణుబొట్ల లాంఛనంగా ప్రారంభించారు. ఇక్కడ గాత్రం, వాయిద్యంతో సహా సంగీతం నేర్చుకోవడానికి అత్యంత అనుకూలమైనదని లక్ష్మీ నారాయణ ఏలూరి పేర్కొన్నారు.